

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రేమోన్మాది చేతిలో హత్యకు గురైన బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ డిమాండ్ చేశారు. - 8లో ▸



ఆపద్బాంధవులు

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని 2014 బ్యాచ్‌కు చెందిన సబ్‌ఇన్‌స్పెక్టర్లు.. ఆపదలో ఉన్న ఎస్సైల కుటుంబాలకు మేమున్నామంటూ అండగా నిలుస్తున్నారు. - 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
28^0 / 24^0

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తుంది. సాయంత్రం ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అమ్మవారిని దర్శించుకున్న సీపీ



హన్మకొండ కల్చరల్: శ్రీభద్రకాళి దేవాలయాన్ని ఆదివారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా కుటుంబసమేతంగా సందర్శించారు. ఆలయ అర్చకులు వారికి ఘనంగా స్వాగతించారు. సీపీ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసిన అనంతరం అర్చకులు తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలు, మహాదాశీర్వచనం అందజేశారు.

నేడు జగన్నాథ రథయాత్ర



హన్మకొండ కల్చరల్: వరంగల్ ములుగురోడ్డులోని ఇస్కాన్ దేవాలయం ఆధ్వర్యంలో సోమవారం జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్నట్లు వరంగల్ ఇస్కాన్ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు మధ్యాహ్నం 2 గంటలకు పబ్లిక్ గార్డెన్ నుంచి రథ యాత్ర ప్రారంభమై.. కేఎంసీ, ఎంజీఎం, పోచమ్మ మైదాన్ నుంచి యూటర్న్ తీసుకుని తిరిగి ఎంజీఎం రోడ్డు మీదుగా ములుగురోడ్డులోని వెంకటేశ్వర గార్డెన్స్ వరకు కొనసాగుతుందని తెలిపారు. అనంతరం వెంకటేశ్వర గార్డెన్స్‌లో శ్రీబలరామ సుభద్ర జగన్నాథ మూర్తులను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు, భజనలు జరుగుతాయని, భక్తులకు ప్రసాదాల వితరణ ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

యువకుడిని కత్తితో పొడిచిన వ్యక్తి అరెస్ట్



ఊర కృష్ణ

రాయపర్తి(వర్ధన్నపేట): వర్ధన్నపేటలోని భారతీయ థియేటర్‌లో యువకుడిని కత్తిపోట్లకు గురిచేసిన ఊర కృష్ణను ఆదివారం అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. తన కూతురిని ప్రేమించాడని ఈనెల 12న సాయంత్రం 6:15 గంటలకు థియేటర్‌లో యువకుడు కల్లెం విజయ్‌ని కృష్ణ ఐదు కత్తిపోట్లు పొడిచిన విషయం విదితమే. ఈ క్రమంలో నిందితుడు పరారీలో ఉండగా వర్ధన్నపేట పోలీసులు ఉప్పరపల్లి క్రాస్ వద్ద అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

సెమిస్టర్ పరీక్షల ఫీజు గడువు 22 వరకు

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో బీటెక్ (సీఈ, ఎంఈ, ఈఐఈ, సీఎస్ఈ, ఈఈఈ, ఇసీఈ, ఐటీ అండ్ మైనింగ్ ఇంజనీరింగ్ నాన్ సీబీసీఎస్) ఫస్టియర్, సెకండియర్ మొదటి సెమిస్టర్, సెకండియర్ రెండో సెమిస్టర్, మూడో సంవత్సరం మొదటి సెమిస్టర్, మూడో సంవత్సరం రెండో సెమిస్టర్, నాలుగో సంవత్సరం మొదటి సెమిస్టర్, రెండో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలకు విద్యార్థులకు ఫీజు చెల్లించేందుకు గడువు అపరాధ రుసుము లేకుండా ఈనెల 22వరకు ఉందని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి రాధిక తెలిపారు. రూ.250 అపరాధ రుసుముతో ఈ నెల 24 వరకు గడువు ఉందని వారు తెలిపారు. అన్ని పేపర్లకు రూ.1,100, బ్యాక్‌లాగ్స్ అప్ టు రెండు పేపర్ల వరకు రూ.600, ఇంప్రూవ్‌మెంట్‌కు ప్రతీ పేపర్‌కు రూ.300ల చొప్పున పరీక్ష ఫీజు చెల్లించాలని వారు కోరారు. పూర్తి వివరాలకు యూనివర్సిటీ సంబంధిత వెబ్‌సైట్‌లోనూ చూడవచ్చని తెలిపారు.

నేడు బల్దియా ఉద్యోగులకు కౌన్సెలింగ్

వరంగల్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రేటర్, కార్పొరేషన్, మున్సిపాలిటీలోని ఉద్యోగులకు సోమవారం హనుమకొండ కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) కాంప్లెక్స్‌లోని రీజినల్ మున్సిపల్ (ఆర్డీ) కార్యాలయంలో కౌన్సెలింగ్ జరగనుంది. నాలుగేళ్లకు పైగా ఒకే చోట విధులు నిర్వర్తిస్తున్న మున్సిపల్ మేనేజర్లు, రెవెన్యూ అధికారులు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు ఇతర ఉద్యోగులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు దశల వారీగా ఆర్డీ షాహిద్ మసూద్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఉద్యోగులంతా నిర్ణీత సమయంలో హాజరుకావాలని అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

అదనపు వసూళ్లకు చెక్

- మీ సేవ కేంద్రాల్లో ఆన్‌లైన్ చెల్లింపులు
- క్యూఆర్ కోడ్‌తో నిర్దేశిత రుసుమే వసూలు
- తీరనున్న వినియోగదారుల ఇబ్బందులు
- కమీషన్ పెంచాలంటున్న నిర్వాహకులు



మీ సేవ కేంద్రం

చెన్నారావుపేట: వినియోగదారులకు సులభంగా, వేగంగా సేవలందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మీ సేవ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఆయా ధ్రువపత్రాలు, ఇతర అవసరాల కోసం కార్యాలయాల్లో రాతపూర్వకంగా దరఖాస్తులు ఇచ్చే విధానానికి స్వస్తి పలికింది. ప్రభుత్వ సేవలన్నీ ప్రస్తుతం మీ సేవ కేంద్రాల్లోనే లభిస్తున్నాయి. ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించిన సేవలు ఎక్కువగా ఉంటున్నాయి. మీ సేవ కేంద్రాల్లో ఆయా సేవలకు తీసుకోవాల్సిన రుసుమును ప్రభుత్వం నిర్దేశించింది. ఏ సేవకు ఎంత రుసుము తీసుకోవాలో వినియోగదారులకు కనిపించేలా కేంద్రాల్లో బోర్డులు ప్రదర్శించాలి. జిల్లాలో 4 ప్రభుత్వ మీసేవ కేంద్రాలు, 77 టీజీటీఎస్, 15 టీజీ ఆన్‌లైన్, 29 ఓఎస్ఎస్ మొత్తం 125 కేంద్రాలు ఉన్నాయి. కొందరు నిర్వాహకులు ప్రభుత్వం నిర్దేశించిన రుసుము కంటే అదనపు వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మీ సేవ కేంద్రాల దోపిడీకి అడ్డుకట్ట వేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం నగదు రహిత చెల్లింపుల విధానానికి శ్రీకారం చుట్టింది.

క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి..

మీ సేవ కేంద్రాల్లో రెవెన్యూపరమైన సేవలకు నగదు రహిత చెల్లింపులను తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. జూలై ఒకటి నుంచి ఈ నూతన విధానం పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చింది. అంతకుముందే ప్రభుత్వం నిర్వహిస్తున్న కేంద్రాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసింది. ఇది సత్ఫలితాలు ఇవ్వడంతో ఇక ప్రైవేట్ కేంద్రాల్లోనూ క్యూఆర్ కోడ్ స్కానర్ ద్వారా రుసుము వసూలు చేయాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో మీ సేవ కేంద్రాల నిర్వాహకులు స్కానర్లు ఏర్పాటు చేసుకున్నారు. కానీ, గ్రామీణ ప్రాంతాల్లో క్యూఆర్ కోడ్ చెల్లింపులపై ప్రజలకు అవగాహన చాలా తక్కువగా ఉంటుంది. మళ్లీ మీ సేవ కేంద్రం నిర్వాహకులే వారి సెల్‌ఫోన్ల ద్వారా బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. అందుకే గ్రామీణ ప్రజలకు మొదట ఆన్‌లైన్ చెల్లింపులపై అవగాహన కల్పించాల్సిన అవసరముంది.

రానున్న రోజుల్లో అన్ని సర్టిఫికెట్లకు..

మీ సేవ కేంద్రాల్లో రెవెన్యూకు సంబంధించి ఏ సర్టిఫికెట్‌కైనా క్యూ ఆర్ కోడ్ ద్వారానే డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. నిర్వాహకులు స్కాన్ చేయగానే ఎన్ని డబ్బులు చెల్లించాల్సి ఉంటుందో అన్నే డెబిట్ అవుతాయి. దీంతో అధిక వసూళ్లకు బ్రేక్ పడనుంది. రానున్న రోజుల్లో అన్ని సర్టిఫికెట్లకు క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపులు జరిపే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

సెప్టెంబర్ నుంచి ఎల్–1 డివైజ్‌ల వినియోగం

ఏ ప్రభుత్వ పథకానికైనా ఈ–కేవైసీ తప్పనిసరి. బయోమెట్రిక్ డివైజ్‌ల ద్వారా వేలిముద్రలు తీసుకుంటారు. నూతనంగా మీ సేవ కేంద్రాలకు కొత్త పరికరాలు ఏర్పాటు చేయాలని యూఐడీఏఐ ఆదేశాలు జారీ చేసింది. మీ సేవ కేంద్రాల్లో ప్రస్తుతమున్న బయోమెట్రిక్ డివైజ్‌ల స్థానంలో ఎల్–0 మోడల్ పరికరాలను తీసేసి ఎల్–1 పరికరాలను ఉపయోగించాలని ఆదేశాలను జారీ చేసింది. జూలై 1 తర్వాతే అమలు చేయాలని ఆదేశాలు జారీచేసినప్పటికీ ప్రభుత్వం సెప్టెంబర్ వరకు మళ్లీ గడువు విధించింది. తప్పనిసరిగా ఎల్–1 డివైజ్‌లను వాడాల్సి ఉంటుంది. ప్రతి మీసేవ కేంద్రం నిర్వాహకులు వీటిని కొనుగోలు చేయాల్సి ఉంటుంది.

వసూళ్లకు ఫుల్‌స్టాప్..

మీ సేవ కేంద్రాల్లో ఏ సర్టిఫికెట్‌కైనా రూ.100 తీసుకోవాల్సి ఉంది. కానీ, కొందరు నిర్వాహకులు రూ.120 నుంచి రూ.150 వరకు వసూలు చేస్తున్న ట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎక్కువగా రెవెన్యూ సంబంధిత సర్టిఫికెట్ల అవసరం ఉంటుంది. అధిక వ సూళ్లకు అడ్డుకట్ట వేసేందుకు మొదట మీ సేవ కేంద్రాల్లో రెవెన్యూ సేవలన్నింటికీ నగదు రహిత చెల్లింపులు తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.



QRCODE

ఉచిత విద్యుత్ ఇవ్వాలి



ప్రభుత్వం మీ సేవ కేంద్రాల నిర్వాహకులకు ఉచిత విద్యుత్‌తోపాటు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలి. గ్రామస్థాయిలో రైతులకు అవసరమైన పహాణీలు, 1బీ వంటి సేవలు ధరణి పోర్టల్ వచ్చిన తర్వాత రద్దు చేయడంతో ఇబ్బందులు పడుతున్నాం. మహిళా సంఘాల ద్వారా సేవలు అందించడంతో జీవనోపాధి దెబ్బతింటోంది.

- పూర్ణచందర్, మీసేవ కేంద్రం నిర్వాహకుడు

నిర్వహణ కష్టమవుతోంది..

ప్రభుత్వ నిబంధనలతో పెరుగుతున్న నిత్యావసర ధరలు, కరెంటు బిల్లులు, అద్దెలతో మీ సేవ కేంద్రాల నిర్వాహణ కష్టతరమవుతోందని నిర్వాహకులు వాపోతున్నారు. నిబంధనలకు అనుగుణంగా సేవలు అందిస్తే ప్రభుత్వం రూ.10 కమీషన్ అందించింది. నిర్వాహకుల విజ్ఞప్తి మేరకు 2017లో రూ.10 కమీషన్‌ను రూ.15కు పెంచింది. కరోనా కంటే ముందు, తర్వాత అన్ని రకాల ముడి సరుకుల ధరలు, అద్దెలు పెరగడంతో జీవనం సాగించడం ఇబ్బందిగా ఉంది. కొత్త నిబంధనలతోపాటు కమీషన్ పెంచి, ఉచిత కరెంట్, ఉచిత ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలి. అన్ని రకాల సేవలు మీ సేవ కేంద్రాల నుంచే అందించేలా చూడాలని నిర్వాహకులు కోరుతున్నారు.

ఆన్‌లైన్‌లోనే చెల్లించాలి..

మీ సేవ కేంద్రాల్లో ఆన్‌లైన్ ద్వారానే డబ్బులు చెల్లించాలి. ఈ విధానాన్ని అన్ని మీ సేవ కేంద్రాల్లో అమలు చేస్తాం. వినియోగదారులు పొందిన సేవలకు క్యూఆర్‌కోడ్ ద్వారానే రుసుము చెల్లించాలి. మీ సేవ కేంద్రాల నిర్వాహకులు సెప్టెంబర్ వరకు బయోమెట్రిక్ ఎల్–1 పరికరాలు ఏర్పాటు చేసుకోవాలి.

- అల్లూరి రాజ్‌కుమార్, ఈడీఎం

‘రైతు భరోసా’పై కీలక భేటీ!

- నేడు వరంగల్‌కు మంత్రివర్గ ఉపసంఘం
- కలెక్టరేట్‌లో అభిప్రాయ సేకరణ



సాక్షిప్రతినిధి, వరంగల్ : ‘రైతు భరోసా’ అమలుపై అభిప్రాయసేకరణలో భాగంగా సోమవారం మంత్రివర్గ ఉపసంఘం హనుమకొండ కలెక్టరేట్‌లో కీలక భేటీ నిర్వహించనుంది. రైతు భరోసా విధివిధానాల కోసం రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించిన విషయం తెలిసిందే. ఈ మేరకు అన్ని వర్గాల సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే ప్రభుత్వం రైతుభరోసా పథకం విధివిధానాలు ప్రకటిస్తుందని మంత్రివర్గ ఉపసంఘం స్పష్టం చేసింది. ఈ క్రమంలో మంత్రివర్గ ఉపసంఘం ఈనెల 11 నుంచి జిల్లాల్లో పర్యటిస్తోంది. 11న ఆదిలాబాద్, 12న మహబూబ్‌నగర్‌లో పర్యటించగా.. సోమవారం వరంగల్‌లో వర్క్‌షాప్ నిర్వహించనుంది. అలాగే 16న మెదక్, 18న నిజామాబాద్, 19న కరీంనగర్, 22న నల్గొండ, చివరగా 23న రంగారెడ్డి జిల్లాతో అభిప్రాయ సేకరణ పూర్తి కానుంది. ఈ నేపథ్యంలో మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో సభ్యులు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉమ్మడి జిల్లా కలెక్టర్లు ఇందులో పాల్గొననున్నారు. ఉమ్మడి వరంగల్‌లోని 12 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి సుమారు 500 మందికి పైగా రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వివిధ రంగాలకు చెందిన బాధ్యులు హాజరయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. రైతు భరోసా పథకం అమలుపై వీరందరి సూచనలు, సలహాలు స్వీకరించేందుకు వీలుగా అవసరమైన ఏర్పాట్లు చేశారు. కౌలు రైతులకు ఇప్పటి వరకు ఈ పథకం వర్తించని నేపథ్యంలో వారికి ఎలాంటి విధివిధానాలు అమలుచేయాలి? అన్న అంశాలపై నేరుగా అభిప్రాయాలు సేకరించనున్నారని తెలిసింది. ఇదిలా ఉండగా.. సోమవారం ఉదయం 10.30 గంటలకు హనుమకొండ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో నిర్వహించనున్న ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యశాల(వర్క్‌షాప్) నిర్వహించనున్న నేపథ్యంలో కలెక్టరేట్ కార్యాలయంలో ప్రతీ సోమవారం చేపట్టే ‘ప్రజావాణి’ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు సమాచార పౌరసంబంధాల శాఖ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

మత్తు నియంత్రణకు కఠిన చర్యలు

- కమిషనరేట్‌లో డ్రగ్స్ కంట్రోల్ టీం ఏర్పాటు
- సీపీ అంబర్ కిశోర్ ఝా



వరంగల్ క్రైం: యువత, విద్యార్థులు మత్తు బారిన పడకుండా.. గంజాయి లాంటి పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం.. అందులో భాగంగా కమిషనరేట్ పరిధిలో యాంటీ డ్రగ్స్ కంట్రోల్ టీం ఏర్పాటు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా తెలిపారు. ఈ టీంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్, ముగ్గురు ఆర్ఎస్సైలు, పోలీసు సిబ్బంది ఉంటారని పేర్కొన్నారు. ఈ ప్రత్యేక విభాగం పోలీసులు ట్రై సిటీతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో అధికంగా మత్తు పదార్థాలను సేవించేందుకు అనువైన ప్రదేశాలతో పాటు కాలేజీలు, గంజాయి విక్రయాలు జరిగే పాత శాలలు, ప్రధాన కూడళ్లు, సినిమా థియేటర్లు, షాపింగ్ మాల్స్‌పై దృష్టి సారిస్తారని చెప్పారు. అలాగే, రాత్రి సమయాల్లో నగరంలో గంజాయి వినియోగించేందుకు అనువైన ప్రదేశాలను గుర్తించేందుకు స్థానిక పోలీసులతో కలిసి నిరంతరం గస్తీ నిర్వహించి గంజాయి సేవించే ప్రాంతాలపై మెరుపు దాడులు చేసి నిందితులపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. గంజాయి మహమ్మారి వల్ల పిల్లల భవిష్యత్ అంధకారంలో పడకుండా ఉండాలంటే తల్లిదండ్రులతో పాటు ప్రతీ పౌరుడు తమ వంతు బాధ్యతగా మత్తు పదార్థాల నిర్మూలన, నియంత్రణకు కృషి చేయాలని సీపీ పిలుపునిచ్చారు. ఎవరైనా మత్తు పదార్థాలు సేవిస్తున్నా.. విక్రయిస్తున్నా.. రవాణా చేస్తున్నా.. 87125 84473 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అధిక మొత్తంలో గంజాయి పట్టుబడితే నగదు పురస్కారం ఇస్తామని, గంజాయి రహిత పోలీస్ కమిషనరేట్ ప్రధాన లక్ష్యమని సీపీ వివరించారు.

ఉగ్రప్రభ, త్వరితా క్రమాల్లో అమ్మవారు



అమ్మవారి దర్శనం కోసం ఆలయంలో బారులుదీరిన భక్తులు







ఉగ్రప్రభ, త్వరితా క్రమాల్లో అలంకరణ

హన్మకొండ కల్చరల్: శాకంబరీ నవరాత్రోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు ఆదివారం శ్రీభద్రకాళి దేవాలయంలో అమ్మవారిని ఉగ్రప్రభా, త్వరితా క్రమాల్లో అలంకరించి పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాతసేవ, నిత్యాహ్నికం, క్షీరాన్న నివేదన, నీరాజన మంత్రపుష్పం అనంతరం అమ్మవారి మూలమూర్తిని పూలమాలలతో అలంకరించారు. తర్వాత తిథి మండల దేవతాయజనంలో భాగంగా అమ్మవారి స్నపనమూర్తిని కాళీక్రమమైన ఉగ్రప్రభ అమ్మవారిగా, అమ్మవారి భోగబేరాన్ని షోడశీక్రమంలో త్వరితా అమ్మవారిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ శేషుభారతి పర్యవేక్షించారు. ఆదివారం సెలవు రోజు కావడంతో అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

రెండోజత యూనిఫాం పంపిణీకి ఏర్పాట్లు



చెన్నారావుపేటలో కుట్టిన యూనిఫాం చూపిస్తున్న మహిళా సంఘాల సభ్యులు(ఫైల్)



స్కూల్ యూనిఫాం స్టిచింగ్‌ను పరిశీలిస్తున్న డీఆర్డీఏ ఏపీఎం కొమురయ్య

కాశిబుగ్గ సెంటర్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రతి సంవత్సరం రెండు జతల యూనిఫాం ఉచితంగా అందజేస్తున్నారు. ఈ విద్యాసంవత్సరం మాత్రం ఒకజత చొప్పున జిల్లాలోని 569 పాఠశాలల్లో చదువుతున్న 38,020 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. డీఆర్డీఏ అధికారుల ఆదేశాల మేరకు స్వయం సహాయక సంఘాల మహిళలు యూనిఫాం కుట్టారు. రెండో విడత కూడా యూనిఫాం అందించేందుకు సిద్ధం చేస్తున్నారు. వీరందరికీ ఈనెల చివరిలో యూనిఫాం తయారు చేసి విద్యాశాఖ అధికారులకు అందజేయనున్నారు. అనంతరం అధికారులు వచ్చే నెల ఒకటి నుంచి విద్యార్థులకు పంపిణీ చేయనున్నారు.

ఆగస్టు ఒకటి నుంచి పంపిణీ



రెండో విడత యూనిఫాం ఇప్పటికే జిల్లాకు చేరుకుంది. మొదటి విడత యూనిఫాం అనుకున్న సమయానికి డీఆర్డీఓ ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసి ఇచ్చారు. తిరిగి రెండో విడత కూడా స్వయం సహాయక సంఘాలకు కుట్టే బాధ్యతలు అప్పగించాం. ఈనెల చివరి వరకు అందజేయనున్నారు. యూనిఫాం అందగానే ఆగస్టు ఒకటి నుంచి విద్యార్థులకు పంపిణీ చేయాలని నిర్ణయించాం.

- డి.వాసంతి, డీఈఓ

ఆక్రమణలపై నజర్

చెరువుల అన్యాక్రాంతంపై అప్రమత్తం

- హైకోర్టు ఆదేశాలతో రంగంలోకి అధికారులు
- ప్రత్యేక బృందాల్ని ఏర్పాటు చేసిన కమిషనర్
- చిన్న వడ్డేపల్లి చెరువులో ఆగని నిర్మాణాలు
- పట్టించుకోని టౌన్ ప్లానింగ్ విభాగం



చిన్నవడ్డేపల్లి చెరువు ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు

వరంగల్: నగరంలోని చెరువులు అన్యాక్రాంతం అవుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, చెరువుల పరిరక్షణ కమిటీలు రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. చెరువుల ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్)లో హనుమకొండ, వరంగల్ మండలాల పరిధిలోని బంధం చెరువు పరిధిలో 366, భద్రకాళి చెరువు పరిధిలో 249, చిన్నవడ్డేపల్లి చెరువు పరిధిలో 329, కోట చెరువు పరిధిలో 150 ఆక్రమణలు ఉన్నట్లు అధికారులు గుర్తించినా.. హైకోర్టు చర్యలు తీసుకోవాలని వరంగల్ మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు ఇటీవల మున్సిపల్ కమిషనర్ ఇరిగేషన్, రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, పోలీసుల శాఖలకు చెందిన అధికారులతో సమావేశం నిర్వహించి వరంగల్, హనుమకొండ పరిధి చెరువుల్లో ఆక్రమణలను గుర్తించేందుకు సర్వే కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

ముంపునకు ఆక్రమణలే కారణం

నగరంలోని చెరువులు ఆక్రమణకు గురవుతున్నందున లోతట్టు ప్రాంతాలు జలమయవుతున్నాయని, ఎఫ్‌టీఎల్ పరిధిలోని అక్రమ నిర్మాణాల్ని తొలగించాలని ప్రభుత్వం పలుమార్లు హెచ్చరికలు చేస్తున్నా.. అధికార గణం పట్టించుకోకపోవడంతో యథేచ్ఛగా భూములు కబ్జాలకు గురవుతున్నాయి. మిషన్ కాకతీయలో భాగంగా చెరువుల భూములు అన్యాక్రాంతం కాకుండా ఎఫ్‌టీఎల్ పరిధిలో చెట్లు పెంచాలని ప్రభుత్వ ఆదేశాలు పట్టించుకోలేదు. నగరంలోని పలు చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలో ఆక్రమణదారులు నిర్మాణాలు చేపడుతున్నప్పటికీ నగర పాలక సంస్థ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎఫ్‌టీఎల్ పరిధి రెవెన్యూ శాఖ నిర్ధారించాలని మైనర్ ఇరిగేషన్ శాఖ అధికారులు తప్పించుకుంటున్నారు. కార్పొరేషన్‌లో గ్రామాలు విలీనం చేస్తున్న సమయంలో ఆక్రమణదారులు కట్టడాలకు అనుమతులు పొందారు. ఆ అనుమతి పత్రాలను సాకుగా చూపుతూ.. ఎఫ్‌టీఎల్‌లో పరిధిలో ఆక్రమంగా నిర్మాణం చేస్తున్నా.. కార్పొరేషన్ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించడంపై స్థానికుల పలు ఆరోపణలు చేస్తున్నారు.

ఎఫ్‌టీఎల్‌లో అనుమతులు

ప్రతీ చెరువు ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్) పరిధిలో ఎలాంటి నిర్మాణాలకు అనుమతి ఇవ్వొద్దని అత్యున్నత న్యాయ స్థానం సుప్రీంకోర్టు ఆదేశాలున్నాయి. చెరువుల పరిధి ఎఫ్‌టీఎల్ భూములపై అధికారులు, రియల్టర్లు, రాజకీయ నాయకులు కన్నేశారు. దీంతో చెరువుల్లో ఆక్రమణలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఎఫ్‌టీఎల్ భూముల్లో అక్రమ నిర్మాణాలు సాగుతున్నప్పటికీ ఆక్రమణదారులు ఇస్తున్న నజరానాలతో ఇరిగేషన్, రెవెన్యూ, గ్రేటర్ కార్పొరేషన్ అధికారులు పట్టించుకోకవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెవెన్యూ శాఖ అధికారులతో కుమ్మక్కైన రియల్టర్లు నకిలీ పత్రాలను సైతం తయారు చేసి భూములు ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని చెరువుల పరిరక్షణ నాయకులు ఆరోపిస్తున్నారు.

చిన్న వడ్డేపల్లిలో ఆగని నిర్మాణాలు

దేశాయిపేట సమీపంలోని చిన్న వడ్డేపల్లి చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఆక్రమణ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఇప్పటి వరకు సుమారు 15 ఎకరాలకుపైగా అన్యాక్రాంతం అయినట్లు అధికారికంగా తెలిసింది. మరో ఐదెకరాలను ఈచెరువు చుట్టూ.. ఉన్న కార్పొరేటర్ల అండతో రియల్టర్లు ఆక్రమణలు చేసుకునేందుకు చెత్తాచెదారం, మట్టితో లెవల్ చేయిస్తున్నారు. ప్రతీ చెరువు ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్) పరిధిలో ఎలాంటి నిర్మాణాలకు అనుమతివ్వొద్దని అత్యున్నత న్యాయ స్థానం సుప్రీంకోర్టు ఆదేశాలున్నాయి. నగరాభివృద్ధిలో భాగంగా.. భవనాలు, రోడ్ల నిర్మాణాల వల్ల చెరువుల్లోకి వర్షపు నీరు రావడం రోజురోజుకు పెరిగిపోయింది. చెరువులో మట్టి పోయడం వల్ల విస్తీర్ణం తగ్గి పక్కనే ఉన్న కాలనీలు వర్షాకాలంలో రెండు, మూడ్రోజులు ముంపులోనే ఉండి పోయాయి. ఇరిగేషన్ అధికారులు ఉదాసీన వైఖరితో ఉండి నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్లు ఇవ్వకున్నా.. రెవెన్యూ అధికారుల అండదండలతో పట్టాలు సృష్టించడం వల్ల ఆక్రమణలు జరుగుతున్నట్లు చెరువుల పరిరక్షణ నాయకులు ఆరోపిస్తున్నారు.

బృందాలు ఏర్పాటు చేశారు..

వరంగల్ మండలం కోట చెరువు, భద్రకాళి, చిన్న వడ్డేపల్లి చెరువుల్లో ఆక్రమణలు గుర్తించేందుకు బల్దియా టౌన్ ప్లానింగ్ అధికారులు, రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసుశాఖల అధికారులతో బృందాలు ఏర్పాటయ్యాయి. నివేదికలు తయారయ్యాక హైకోర్టు ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

- మహ్మద్ ఇక్బాల్, వరంగల్ తహసీల్దార్

ఆక్రమణలపై సర్వే జరుగుతోంది..

హనుమకొండ, వరంగల్ మండల పరిధి చెరువులు బంధం చెరువు, వడ్డేపల్లి, భద్రకాళి, కోట చెరువు, చిన్న వడ్డేపల్లి చెరువు ఎఫ్‌టీఎల్‌లో అక్రమంగా నిర్మించిన నిర్మాణాల్ని గుర్తించే ప్రక్రియ ప్రారంభమైంది. సర్వే పూర్తి కాగానే.. ఉన్నతాధికారుల ఆదేశాలతో చర్యలు తీసుకుంటాం.

- హర్షవర్ధన్, డీఈఈ, ఇరిగేషన్

నేటి కలెక్టరేట్ గ్రీవెన్స్ రద్దు

కాశిబుగ్గ సెంటర్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ సత్య శారదాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించిన రైతు భరోసా పథకం సదస్సు హనుమకొండ కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న దృష్ట్యా కలెక్టరేట్‌లో నిర్వహించే గ్రీవెన్స్ రద్దు చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. జిల్లా ప్రజలు గమనించాలని కలెక్టర్ కోరారు.

రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్‌కు అభినందనలు

హసన్‌పర్తి: రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమితులైన ఎండీ.రియాజ్‌ను కాంగ్రెస్ కిసాన్ సెల్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పింగిళి వెంకట్రాం నర్సింహారెడ్డి హైదరాబాద్‌లో ఆదివారం కలిశారు. ఈసందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మదన్ గౌడ్, జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రియాజ్‌ను అభినందిస్తున్న వెంకట్రాంనర్సింహారెడ్డి

కనికరించని మృత్యువు..

● రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న అభిలాష్ మృతి
● మిన్నంటిన తల్లిదండ్రుల రోదనలు
● ఊరంతా కదలివచ్చి యువకుడికి అంతిమ వీడ్కోలు


అభిలాష్(ఫైల్)

ఐనవోలు : మృత్యువు కనికరించ లేదు. గత నెల 30వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అభిలాష్ మృతి చెందాడు. దీంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని ఒంటిమామిడిపల్లికి చెందిన మామిండ్ల అభిలాష్(19) జూన్ 30న చెల్లెలు అక్షయకు సంబంధించిన సర్టిఫికెట్లు తీసుకురావడానికి పున్నేలు క్రాస్ వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలైన అభిలాష్ 15 రోజుల పాటు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడి ఆదివారం ఉదయం మృతి చెందాడు. తిరుపతి, మానస దంపతులకు అభిలాష్ ఒక్కగానొక్క కొడుకు. అభిలాష్ బతకాలని డబ్బుకు వెనుకాడకుండా సుమారు రూ.25లక్షల వరకు ఖర్చుచేశారు. అయినా మృత్యువు కనికరించలేదు. పోస్టుమార్టం అనంతరం అభిలాష్ మృతదేహం అంబులెన్స్‌లో తహసీల్ కార్యాలయం వద్దకు రాగానే సుమారు 200 మంది భావోద్వేగానికి గురయ్యారు. అక్కడి నుంచి సుమారు 6 గంటల పాటు గ్రామంలో బైక్ ర్యాలీతో శవయాత్ర నిర్వహించారు. ఊరంత కదలి రాగా శ్మశానవాటికలో అభిలాష్ అంతిమ సంస్కారాలు చేశారు. పోస్టుమార్టం కేంద్రం వద్ద టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, మాజీ ఎంపీపీ మధుమతి, మాజీ సర్పంచ్ ఆడెపు దయాకర్ మాజీ ఎంపీటీసీ రాజు, పలువురు నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఇద్దరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు..!

ఖిలా వరంగల్ : ఓ విశ్రాంతి ఉపాధ్యాయుడిని కులం పేరుతో దూషించిన ఇద్దరిపై మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ,ఎస్టీ అట్రాసిటి కేసు నమోదైనట్లు తెలిసింది. వరంగల్ నర్సంపేట రోడ్డు లేబర్ కాలనీకి చెందిన ఓ రిటైర్డ్ ఉపాధ్యాయుడి వద్ద తీసుకున్న డబ్బులు అడగబోతే ..కులం పేరుతో దుర్భాషలాడడంతో శనివారం రాత్రి బాధితుడు మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీనిపై వరంగల్ ఏసీపీ పూర్తి స్థాయిలో విచారణ చేపట్టడంతో శనివారం రాత్రే రిటైర్డ్ ఉపాధ్యాయుడిని దుర్భాషలాడిన ఇద్దరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదైనట్లు తెలిసింది. ఆదివారం ఉదయం సోషల్ మీడియా, వాట్సాప్‌లో కాంగ్రెస్ నాయకులపై ఎస్టీ, ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదైనట్లు ఓ వార్త చక్కర్లు కొట్టింది. కేసు వివరణ కోసం సీఐ మల్లయ్యను ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

షూ షోరూంలో షార్ట్‌సర్క్యూట్



హన్మకొండ చౌరస్తా: హనుమకొండ చౌరస్తాలోని 'ఖాదీమ్స్' షూ షోరూంలో ఆదివారం రాత్రి 8గంటల సమయంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని హనుమకొండ, వరంగల్ ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. దాదాపు నాలుగు గంటల పాటు శ్రమించాక మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చాయి మంటలు పక్క దుకాణాలకు వ్యాప్తి చెందకుండా ఫైర్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి మంటలు ఆర్పివేశారు. దీంతో భారీ ఆస్తి నష్టం తప్పిందని పరిసర ప్రాంతాల యాజమాన్యాలు ఊపిరి పీల్చుకున్నాయి.

వాజేడు.. శోకసంద్రం

● రోడ్డు ప్రమాద ఘటనలో నాలుగుకు చేరిన మృతుల సంఖ్య
● ఒకే కుంటుంబంలో ముగ్గురు
● తండ్రి మృతితో ఇంటి బాధ్యత మోస్తున్న కొడుకు
● నాగరాజు మృతితో దిక్కు తోచని స్థితిలో కుటుంబం


ఎర్రబాబు రాజు ఇంటి వద్ద ప్రజలు

వాజేడు: ములుగు జిల్లా వాజేడు శోకసంద్రమైంది. ఏటూరునాగారం సమీపంలో హైవే ట్రీట్ వద్ద జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాద ఘటనలో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. ఇందులో ఒకే కుటుంబానికి చెందిన వారు ముగ్గురు ఉండగా, పేదవర్గానికి చెందిన తల్లండి నాగరాజు(20) ఉన్నాడు. వీరందరూ వాజేడు వాసులు కావడంతో మండల కేంద్రంలో విషాద ఛాయలు అములుకున్నాయి. ఏటూరునాగారంలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించగా వారు ఇంటికి తరలించారు. కాకర్ల పూడి సత్య నారాయణ రాజు(ఎర్రబాబు రాజు)(75), అతడి భార్య కాకర్ల పూడి సత్యవతి(65), ఆటోడ్రైవర్ తల్లండి నాగరాజు(20) ఘటనా స్థలిలోనే దుర్మరణం చెందారు. సత్యనారాయణ రాజు తన కూతురు అనిత(48)ను ఏపీలోని కాకినాడ జిల్లా కోదాడ గ్రామానికి చెందిన సాగిరాజు శ్రీనివాసరాజుకు ఇచ్చి వివాహం చేశారు. కాగా, మూడురోజుల క్రితం తల్లిదండ్రుల వద్దకు వచ్చిన ఆమె.. వయసు భారంతో ఉన్న తల్లిదండ్రులను తమ వద్దకు రావాలని కోరింది. ఈ సమయంలో వద్దని మరోసారి ఆలోచిద్దామని తల్లిదండ్రులు తెలపడంతో కూతురు ఇంటికి వెళ్లడానికి సిద్ధమైంది. దీంతో ఏటూరునాగారంలో బస్సు ఎక్కించడానికి ఆటోలో ఆమెతో తల్లిదండ్రులు కూడా బయలుదేరారు. కంటైనర్ రూపంలో ప్రమాదం జరగడంతో మృతి చెందారు. చికిత్స పొందుతున్న సాగిరాజు అనిత ఎంజీఎంలో మృతి చెందింది.

ఒకే కుంటుంబంలో ముగ్గురి మృతి..

ఒకే కుటుంబానికి చెందిన తల్లి, తండ్రి, కూతురు మృతి చెందడంతో ఆ ఇంటికి వారసులు లేకుండా పోయారు. అందరితో కలివిడిగా ఉండే ఎర్రబాబు రాజు కుటుంబం రోడ్డు ప్రమాదంలో చనిపోయిందనే విషయం తెలుసుకున్న ప్రజలు అధికంగా తరలివచ్చి కన్నీటి పర్యంతమయ్యారు.

తండ్రి మృతితో ఇంటి బాధ్యత మోస్తున్న కొడుకు..

ఆటో డ్రైవర్ తల్లండి నాగరాజు తండ్రి నర్సయ్య గత సంవత్సరం మృతి చెందాడు. దీంతో కుటుంబ పోషణ ఇబ్బందికరంగా మారింది. నాగరాజు తప్పనిసరి పరిస్థితుల్లో కుటుంబ పోషణ బాధ్యత ఎత్తుకున్నాడు. ఆటో నడిపితే తన యజమాని ఇచ్చిన డబ్బులతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో నాగరాజు మృతి చెందడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. నాగరాజుకు తమ్ముడు ఉండగా తల్లి కూలీకి వెళ్తేనే కుటుంబం గడిచి పరిస్థితి ఏర్పడింది. ఆదివా రం ముగ్గురి అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, నాగరాజుతో తోడుగా వెళ్లిన పెనుమళ్ల అంజిరెడ్డి వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తండ్రి వెంకటరెడ్డి తెలిపాడు.

సీపీఎం నాయకుల నివాళి

కాకర్ల పూడు సత్యనారాయణ రాజు సుమారు 30 ఏళ్ల పాటు సీపీఎం మండల కార్య దర్శిగా పని చేశారు. వయసు మీద పడడంతో పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో ఆయన మృతి చెందిన విషయం తెలుసుకున్న సీపీఎం రాష్ట్ర, జిల్లా నాయకులు బండారు రవికుమార్, యలమంచలి రవి, సూడి కృష్ణారెడ్డి, బ్రహ్మచారి, రఘుపతి తదితరులు.. ఎర్రబాబు రాజు మృతదేహం వద్ద నివాళులర్పించారు.

కుటుంబం మొత్తం ..


సాగిరాజు అనిత(ఫైల్)

ఏటూరునాగారం: ఏటూరునాగారం జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతుల సంఖ్య ఆదివారం నాటికి నాలుగుకు చేరింది. ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రానికి చెందిన కాకర్లపూడి సత్యనారాయణ, తన భార్య సత్యవతి తమ కూతురి సాగిరాజు అనిత (48)ను ఏపీలోని తుని పట్టణానికి పంపించడానికి బస్సు ఎక్కించడానికి ఆటోలో ఏటూరునాగారం బస్టాండ్‌కు వస్తున్న క్రమంలో కంటైనర్ ఢీకొట్టి ఆటో డ్రైవర్‌తో సహా ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందిన విషయం విధితమే. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అనితను స్థానిక సామాజిక ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందింది. అనితకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. సత్యనారాయణ, సత్యవతి దంపతులకు అనిత ఒక్కరే కూతురు కావడంతో వారి కుటుంబం మొత్తం రోడ్డు ప్రమాదంలో బలైపోయింది. అనిత మృతితో మృతుల సంఖ్య నాలుగుకు చేరడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆశ్రమాల్లో మౌలిక వసతులు కల్పించాలి

● జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్


ఎంజేపీ బాలికల ఆశ్రమాన్ని తనిఖీ చేస్తున్న హుస్సేన్‌నాయక్

గూడూరు: విద్యాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం నెలకొల్పుతున్న బాలికల, బాలుర ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్ డిమాండ్ చేశారు. గూడూరు శివారు మట్రిమిట్ట సమీపంలోని మహాత్మాజ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ బాలికల ఆశ్రమ పాఠశాలతో పాటు సీతానగరంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను ఆదివారం తనిఖీ చేశారు. ముందు మహాత్మా జ్యోతిబాపూలే ఆశ్రమాన్ని సందర్శించారు. సెలవుదినం కావడంతో బాలికల తల్లిదండ్రులు ఇంటి వద్ద నుంచి భోజనాలు తీసుకొచ్చి పిల్లలకు తినిపించారు. ఈ దృశ్యాలను ఆయన చూశారు. తరువాత భోజన సామాగ్రి గదిలో నిల్వ ఉన్న బియ్యం, వంట సామగ్రి రిజిస్టర్‌లను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులున్నా తనకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. అక్కడ నుంచి సీతానగరంలోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చేరుకోగా విద్యార్థులు కింద కూర్చుని భోజనం చేయడం చూశారు. వెంటనే వారి వద్దకు వెళ్లి బయట కింద కూర్చుని భోజనం చేస్తున్నారని అడిగారు. దీంతో విద్యార్థులు ఇక్కడ డైనింగ్ హాల్ లేదని, రోజూ ఇలాగే తింటామనడంతో ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వెంటనే ట్రైబల్ వెల్ఫేర్ అధికారికి కాల్ చేసి ఇక్కడి సమస్యలు తెలిపి తాను మరోసారి వచ్చేలోగా పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం హెచ్ఎం గాంగూనాయక్,ఉపాధ్యాయ బృందంతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ డీడీ ఎర్రయ్య, ఏసీఎంఓ వీరూలాల్, నాయకులు చెల్పూరు వెంకన్న, మోతీలాల్‌నాయక్, గుగులోత్ రాంబాబునాయక్, నాయిని ధర్మారెడ్డి, చెవులపల్లి దేవేందర్‌రావు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న ఆటో

● సెంట్రింగ్ మేస్త్రీ దుర్మరణం
● రాయపర్తిలో ఘటన


మల్సూర్ (ఫైల్)

రాయపర్తి: బైక్‌ను ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో సెంట్రింగ్ మేస్త్రీ మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. రాయపర్తి మండలకేంద్రానికి చెందిన సెంట్రింగ్ మేస్త్రీ మహమ్మద్ మల్సూర్ (39) బైక్‌పై వర్ధన్నపేట నుంచి రాయపర్తి వస్తున్నాడు. మండల కేంద్రంలోని కేసీఆర్ కాలనీకి వస్తున్న క్రమంలో బైక్‌ను ఆటో ఢీకొంది. దీంతో మల్సూర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షలు నిర్వహించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

● జాతీయ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్


దీపికను పరామర్శిస్తున్న జాతీయ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్

చెన్నారావుపేట: ప్రేమోన్మాది చేతిలో హత్యకు గురైన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని జాతీయ కమిషన్ సభ్యుడు(ఎస్టీ) జాటోతు హుస్సేన్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని పదహారు చింతల్ తండాలో ప్రేమోన్మాది దాడిలో తల్లిదండ్రులను కోల్పోయిన బాధితురాలు దీపికను పరామర్శించి మాట్లాడారు. తండాకు చెందిన గిరిజన దంపతులు బానోతు శ్రీనివాస్, సుగుణను మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గుండెంగ గ్రామానికి చెందిన మేకల నాగరాజు దారుణంగా హత్య చేసి దీపిక, ఆమె సోదరుడు మదన్‌లాల్‌ను తీవ్రంగా గాయపర్చాడన్నారు. గతంలో నాగరాజు తనను వేదిస్తున్నాడని పోలీసులకు తెలిపినా పట్టించుకోకపోవడం.. పైగా అతడికే సహకరించడం బాధకర విషయమన్నారు. నాగరాజు మద్యం మత్తులోనే ఈ దారుణానికి పాల్పడ్డారన్నారు. నిందితుడికి సహకరించిన అతడి మిత్రుల వివరాలు పోలీసులకు తెలిపినా పట్టించుకోకుండా నాగరాజును మాత్రమే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించడం సరికాదన్నారు. ఈ విషయాన్ని జాతీయ కమిషన్, కలెక్టర్, పోలీస్ కమిషనర్ దృష్టికి తీసుకుని వెళ్తానని తెలిపారు. ఇప్పటికైనా పూర్తిస్థాయిలో విచారణ జరిపి నాగరాజుకు సహకరించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ కోకన్వీనర్ రాంచంద్రారెడ్డి, నాయకులు పుల్లారావు, గోగుల రాణాప్రతాప్‌రెడ్డి, దామెరుప్పుల శేఖర్, తదితరులు ఉన్నారు.

తప్పిపోయి వచ్చిన వృద్ధుడు

● నల్లగొండ జిల్లా కట్టంగూర్ అని చెప్పిన చంద్రయ్య


గుండెపుడి ఊరిపక్కతండాలో ఆశ్రయం పొందిన చంద్రయ్య

మరిపెడ రూరల్: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం గుండెపుడి గ్రామానికి 75 ఏళ్ల వయసు కలిగిన చంద్రయ్య ఆదివారం దారితప్పి వచ్చాడు. ఆయన స్వగ్రామం నల్లగొండ జిల్లా కట్టంగూర్ గ్రామం అని చెబుతున్నాడు. ఇంతదూరం ఎందుకు వచ్చాడు.. ఎలా వచ్చాడనే విషయాన్ని చెప్పలేక పోతున్నాడు. దారి తప్పి వచ్చాడా.. లేక సాకలేక కుటుంబ సభ్యులు వెళ్లగొట్టారా అనే విషయం తెలియరాలేదు. ప్రస్తుతం గుండెపుడిలోని ఊరిపక్క తండా గిరిజన వాసులు చంద్రయ్యకు ఆశ్రయం కల్పించారు. అతడి ఫొటో, వివరాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

మనస్తాపంతో యువతి ఆత్మహత్య

ఖానాపురం: తండ్రి మందలించాడనే కారణంతో మనస్తాపానికి గురైన ఓ యువతి.. ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్సై రఘుపతి కథం ప్రకారం.. మండలంలోని బండమీదిమామిడితండాకు చెందిన ధరావత్ కల్యాణి(19) నర్సంపేటలో హాస్టల్‌లో ఉంటూ ఓ ప్రైవేట్ కళాశాలలో మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు చదువుతోంది. ఇందులో భాగంగా ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా అప్రెంటీస్ చేస్తోంది. ఈ క్రమంలో పదిహేను రోజుల నుంచి ఇంటి వద్దే ఉంటుంది. దీంతో కళాశాలకు ఎందుకు వెళ్లడంలేదని తండ్రి మందలించాడు. తాను హాస్టల్‌లో ఉండి చదువుకోలేనని, ఇంటి వద్ద నుంచే వెళ్తానని తల్లిదండ్రులకు తెలిపింది. దీంతో తండ్రి మరోసారి మందలించడంతో ఈనెల 12వ తేదీన పురుగుల మందు ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం నర్సంపేటకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఈ ఘటనపై తల్లి స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రాజకీయ వ్యవస్థలో మార్పు చారిత్రక పరిణామం

● యువజన కాంగ్రెస్ ఎన్నికల వరంగల్ జోనల్ రిటర్నింగ్ అధికారి సందీప్


సమావేశంలో మాట్లాడుతున్న సందీప్

మహబూబాబాద్ రూరల్ : నాయకులను నామినేట్ చేయడం కంటే ఎన్నికల ప్రక్రియ ద్వారా ఎన్నుకోవడం రాజకీయ వ్యవస్థలో మార్పు దేశ రాజకీయాల్లో ఒక చారిత్రక పరిణామమని యువజన కాంగ్రెస్ ఎన్నికల వరంగల్ జోనల్ రిటర్నింగ్ అధికారి సందీప్ అన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చంద్ రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కంకర అయ్యప్పరెడ్డి ఆధ్వర్యంలో కొత్తగా జరగబోయే యువజన కాంగ్రెస్ ఎన్నికల నిర్వహణపై మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి సందీప్ హాజరై మాట్లాడారు. ఇండియన్ యూత్ కాంగ్రెస్ తెలంగాణలో సభ్యత్వం, పూర్తి సంస్థాగత ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించిందన్నారు. దేశ చరిత్రలో ఏ రాజకీయ పార్టీ తమ సంస్థలకు అంతర్గత పార్టీ ఎన్నికలు నిర్వహించలేదన్నారు. ఇండియన్ యూత్ కాంగ్రెస్ తీసుకున్న చారిత్రాత్మక అడుగన్నారు. రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ, ఇండియన్ యూత్ కాంగ్రెస్, నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా యువజన విభాగాలకు ఇన్‌చార్జ్‌గా ఉన్నప్పుడు ఆయన దృష్టిలో ఉంచుకున్నారని తెలిపారు. పార్టీలోని యువ రాజకీయ నేతలను తమ సభ్యులే నేరుగా ఎన్నుకునే కొత్త శకానికి భారతదేశం నాంది పలుకుతుందన్నారు. ఇదే నిజమైన ప్రజాస్వామ్యం అవుతుందన్నారు. సమావేశంలో యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుగులోత్ వంశీ, అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు గంధసిరి శ్రవణ్, రియాజ్ అన్సారీ, పద్మం ప్రవీణ్ కుమార్, బల్లెం చంటి, గార్లపాటి సాయితేజ, జీలుగుల భాస్కర్, రాకేశ్, ఫారూక్, భరత్, ఇంతియాజ్, బాబీ, వినయ్ పాల్గొన్నారు.

ప్రేమోన్మాదిని కఠినంగా శిక్షించాలి

● రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
● మానవ హక్కుల వేదిక బృందం డిమాండ్


దీపికను వివరాలు అడుగుతున్న మానవ హక్కుల వేదిక బృందం

చెన్నారావుపేట: దీపిక తల్లిదండ్రులను చంపిన ప్రేమోన్మాది మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గుండెంగ గ్రామానికి చెందిన నాగరాజును కఠినంగా శిక్షించాలని మానవ హక్కుల వేదిక బృందం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ తిరుపతయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాదావత్ రాజు, రాష్ట్ర కార్యదర్శి హరికృష్ణ డిమాండ్ చేశారు. ఈ నెల 11న మండలంలోని పదహారు చింతల్ తండా గ్రామంలో గిరిజన దంపతులు బానోతు శ్రీనివాస్, సుగుణ దారుణ హత్యకు గురైన విషయం విధితమే. ఈ నేపథ్యంలో ఆదివారం తండాను సందర్శించి మానవ హక్కుల బృందం.. మృతుల కుమార్తె దీపిక, గ్రామస్తులను వివరాలు అడిగి తెలుసుకుంది. అనంతరం బృందం సభ్యులు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. దీపికను నాగరాజు మూడు సంవత్సరాలుగా ప్రేమిస్తున్నానంటూ వేధిస్తున్నాడన్నారు. ఇందులో భాగంగా 2023లో బలవంతంగా నాగరాజు తన తల్లిదండ్రులు ఉంటున్న హైదరాబాద్ తీసుకెళ్లాడన్నారు. దీంతో దీపిక తల్లిదండ్రులు స్థానిక పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు ఆ కేసును ఎఫ్ఐఆర్ చేసినట్లు లేదన్నారు. దీపిక హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు.. జనవరిలో ఇరువురు కుటుంబీకులను పీఎస్‌కు పిలిచి కౌన్సెలింగ్ నిర్వహించారన్నారు. కౌన్సెలింగ్ కూడా పక్షపాతంగా జరిగినట్లు నిజనిర్ధారణలో తేలిందన్నారు. కౌన్సెలింగ్ తర్వాత నాగరాజు బెదిరింపులకు పాల్పడడని ఎస్సై హామీ ఇచ్చినట్లు దీపిక తెలిపిందన్నారు. అయితే నెల రోజులు ఇక్కడే ఉన్న నాగరాజు.. ఇద్దరు, ముగ్గురు మిత్రుల సహకారంతో జూలై 11న తెల్లవారుజామున బయట నిద్రిస్తున్న దీపిక ఆమె తల్లిదండ్రులను దారుణంగా హత్య చేశాడన్నారు. దీపిక తప్పించుకుందన్నారు. ఈ విషయంలో నాగరాజుకు సహకరించిన ఏ ఒక్కరిపై కేసు నమోదు చేయలేదన్నారు. నాగరాజును మాత్రమే అరెస్ట్ చేశారన్నారు. దీనిని మానవ హక్కుల వేదిక తీవ్రంగా ఖండిస్తోందని, బాధిత కుటుంబానికి సత్వర న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో వరంగల్ ఉమ్మడి శాఖ అధ్యక్షులు అద్దునూరి యాదగిరి, పద్మజలు పాల్గొన్నారు.

యువకుడి హత్య!

● పోలీసుల అదుపులో నిందితుడు
● వివరాలు వెల్లడించిన సీఐ సర్వయ్య


నాగరాజు మృతదేహం

కేసముద్రం: మండల కేంద్రంలో ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. ఈ ఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. రూరల్ సీఐ సర్వ య్య కథనం ప్రకారం.. జిలుకర నాగరాజు(30) అనే యువకుడు కొన్నేళ్ల క్రితం తన కుటుంబంతో కలిసి మండల కేంద్రానికి వలస వచ్చాడు. కేసముద్రం విలేజ్ శివారు చైతన్యనగర్ కాలనీలో అద్దెకు ఉంటున్నాడు. నాగరాజు ప్రేమించి పెళ్లి చేసుకోగా భార్య మృతి చెందింది. అప్పటి నుంచి తన తల్లి మంగమ్మతో ఉంటూ కారు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో కేసముద్రంవిలేజ్‌లో వల్లందాసు నగేష్ అనే వ్యక్తి కిరాణ షాపు నడుపుకుంటూ జీవిస్తున్నాడు. నగేష్ భార్య ఉమ అనారో గ్యానికి గురికావడంతో ఇటీవల నెల్లికుదురు మండలం బొడ్లాడలోని తన పుట్టింటికి వెళ్లింది. కూతురు, కుమారుడు హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నారు. ఇదిలా ఉండగా నగేష్ ఇంట్లో నాగరాజు అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. దీనిపై సమాచారం అందుకున్న రూరల్ సీఐ సర్వ య్య, ఎస్సై వంశీధర్ సిబ్బందితో కలిసి ఘట నా స్థలికి చేరుకుని పరిశీలించారు. ఇదిలా ఉండగా తన ఇంట్లో నాగరాజు చోరీ చేస్తుండగా నన్ను చూసి దాడి చేసేందుకు వచ్చాడని, దీంతో తాను ఏం చేయాలో తోచక కర్రతో కొట్టడంతో నాగరాజు చనిపోయినట్లు పోలీసులకు లొంగిపోయిన నగేష్ చెప్పినట్లు రూరల్ సీఐ సర్వయ్య తెలిపారు. కాగా, కర్రతో దాడిచేస్తే మృతదేహంపై ఎక్కడా గాయాలైనట్లుగా కాని, రక్తం ఆనవాళ్లు లేకపోవడంతో ఎలా చనిపోయాడనే విషయం నిర్ధారణకు రావడంలేదు. ఈ ఘటన అనుమానాలకు తావిస్తుండడంతో పలు కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నట్లు రూరల్ సీఐ తెలిపారు.

అంతరాష్ట్ర ముఠా ఘరానా మోసం

● షాపింగ్ మార్ట్‌ల పేరిట డబ్బు వసూళ్లు
● పాలకుర్తిలో వెలుగు చూసిన ఘటన


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

పాలకుర్తిటౌన్: షాపింగ్ మార్ట్‌ల ఏర్పాటు పేర ఇన్వెస్టర్ల నుంచి డబ్బులు వసూలు చేసి ఏర్పాటు చేయకుండా మోసగించిన ఘటన మండల కేంద్రంలో జరిగింది. ఆదివారం పాలకుర్తి పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మహేందర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. గుజరాత్‌కు చెందిన పరుశురాం, రజనీత్‌బాయ్ పాల్‌తో పాటు మరో ఐదుగురు కలిసి 2022లో ఆర్మడ బజార్ షాపింగ్ మార్ట్ స్థాపించారు. కొంతకాలం తర్వాత మార్ట్‌లు దివాళా తీయడంతో నిర్వాహకులకు నష్టం వాటిల్లింది. దీంతో ఎలాగైనా డబ్బులు రికవరీ చేయలనే ఉద్దేశంతో పరుశురాం, రజనీత్‌బాయి పాల్ ఢిల్లీకి చెందిన భీమ్ సింగ్‌ను ప్రమోటర్‌గా నియమించి ఆన్‌లైన్ వేదికగా మోసాలకు తెగబడ్డారు. సోషల్ మీడియాను అడ్డా చేసుకుని పలువురితో చాటింగ్ చేసి ముగ్గులోకి లాగారు. ఇందులో పాలకుర్తికి చెందిన ముగ్గురు వ్యక్తుల దగ్గర నుంచి రూ.30లక్షల వరకు వసూలు చేశారు. చివరికి ప్రాంచైజీలు ఏర్పాటు చేయకుండా మోసగించారు. మోసపోయామని గ్రహించిన బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక టీం ఏర్పాటు చేసి ఢిల్లీకి పంపి రెక్కీ నిర్వహించారు. ఈ రెక్కీలో నిందితుడు భీమ్ సింగ్ పట్టుబడ్డాడు. అతడిపై కేసు నమోదు చేశారు. కేసును పరిష్కరించడంలో కీలకంగా వ్యవహరించిన సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై లింగారెడ్డిని వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్, వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య అభినందించారు.

గురుకులంలో కొండ చిలువలు

● భయంతో వణికిపోతున్న విద్యార్థినులు
● పరకాల మల్లక్‌పేట సోషల్ వెల్ఫేర్‌లో ఘటన


గురుకుల సిబ్బంది చంపిన కొండ చిలువలు

హనుమకొండ(పరకాల): అసలే బాలికల గురుకులం .. పాము కనపడితే ఆమడ దూరం పరుగెత్తే బాలికలు.. ఏకంగా అరడజన్ కొండ చిలువలు చూస్తే ఏమైనా ఉందా? వారిలో కలిగే భయాందోళన మాటల్లో వర్ణించలేం. వర్షాకాలంలో పాముల భయంతో విద్యార్థినులు భయం భయంగా కాలం గడుపుతున్నారు. ఒక్క రోజునే ఆరు కొండ చిలువలు కనిపించడంతో విద్యార్థినులతోపాటు వారి తల్లిదండ్రులు సైతం భయభ్రాంతులకు గురయ్యారు. పరకాల మండలం మల్లక్‌పేట శివారులోని బాలికల సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్‌లో కొంత కాలంగా విద్యార్థినులకు పాములు కనిపిస్తున్నాయి. రెండు రోజుల క్రితం రెసిడెన్షియల్ ప్రాంగణంలో శిథిలావస్థలో ఉన్న భవనం నుంచి మూడు కొండ చిలువ పిల్లలు బయటకు రావడంతో వాటిని గురుకుల సిబ్బంది హతమార్చారు. మరిన్ని ఉండొచ్చనే అనుమానంతో ఫారెస్టు అధికారులకు సమాచారం అందించడంతో శుక్రవారం అర్ధరాత్రి 1 గంటకు చేరుకొని మరో మూడు కొండ చిలువలు పట్టుకున్నారు. ఒకే రోజున ఆరు కొండ చిలువలు గురుకుల ప్రాంగణంలో కనిపించడంతో విద్యార్థినులు రాత్రంతా భయం భయంగా కాలం గడిపారు. గదుల నుంచి బయటకు రావాలంటే వణికిపోయారు.


మీడియా ప్రతినిధులను లోపలికి రాకుండా గేట్ వద్ద కాపలా ఉన్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఉషారాణి

తల్లిదండ్రుల ఆందోళన..

మల్లక్‌పేట సోషల్ వేల్ఫేర్ హాస్టల్‌లో కొండ చిలువలు సంచరించడంపై విద్యార్థినుల తల్లిదండ్రులు గురుకుల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఉషారాణిని పేరెంట్స్ కమిటీ సమావేశంలో శనివారం నిలదీసినట్లు సమాచారం. శిథిల భవనాన్ని తొలగించాలని గతంలో పనిచేసిన అధికారులకు ప్రతిపాదనలు చేసినా పట్టించుకోలేదని, మరోసారి అధికారులకు దృష్టికి తీసుకెళ్తానని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ నచ్చజెప్పినట్లు తెలిసింది.

మీడియా ప్రతినిధులను అడ్డుకున్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్

కొండ చిలువలు సంచరించడంతో ఒకవైపు గురుకుల విద్యార్థినులు భయపడుతుండగా.. మరోవైపు విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన పడుతున్నారు. ఈ విషయంపై ఆదివారం మల్లక్‌పేట రెసిడెన్షియల్ లోపలికి స్థానిక ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులను రాకుండా ప్రధాన గేట్ వద్దే ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఉషారాణి అడ్డుకున్నారు. జర్నలిస్టులు లోపలికి రావాలంటే కచ్చితంగా తెలంగాణ గురుకుల ప్రిన్సిపాల్ సెక్రటరీ ద్వారా లిఖిత పూర్వకంగా అనుమతి తీసుకుని రావాలని స్పష్టం చేశారు. కాగా, రెసిడెన్షియల్‌లో విద్యార్థినుల రక్షణపై తల్లిదండ్రులలో ఆందోళన వ్యక్తమవుతోంది. వెంటనే పాత భవనం కూల్చి చెత్త లేకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.